بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحْمَدُهٗ وَنُصَلِّيْ عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

Full Text of Friday Sermon Hazrat Khalifatul Masih V, 22 May 2026 (Telugu)

# వినయం, విధేయత వెలుగులో పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తమ నైతిక విలువల ఆసక్తిరమైన ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మామినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 22.05.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ ۔
بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ ۝ اَلۡحَمۡدُ لِلّٰہِ رَبِّ الۡعٰلَمِیۡنَ ۝ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ ۝ مٰلِکِ یَوۡمِ الدِّیۡنِ ۝ اِیَّاکَ نَعۡبُدُ وَ اِیَّاکَ نَسۡتَعِیۡنُ ۝ اِہۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِیۡمَ ۝ صِرَاطَ الَّذِیۡنَ اَنۡعَمۡتَ عَلَیۡہِمۡ ۬ۙ غَیۡرِ الۡمَغۡضُوۡبِ عَلَیۡہِمۡ وَ لَا الضَّآلِّیۡنَ ۝

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవితం లోని వినయ విధేయతల గురించిన ప్రస్తావన జరుగుతోంది. ఈ రోజు కూడా అదే ప్రస్తావన కొనసాగును. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చిన్న చిన్న విషయాల ఉదాహరణలను ఇస్తూ దీనిని వ్యక్తపరిచేవారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు ఇట్లన్నారు: నేనొక దాసుడు తినే విధంగానే తింటాను, ఒక దాసుడు కూర్చునే విధంగానే కూర్చుంటాను, ఎందుకంటే నేను కూడా కేవలం ఒక దాసుడినే. అనగా పాలకులలో, ధనికులలో ఉండే అహంకారం, గర్వం లేదా ప్రదర్శన బుద్ధి నాలో లేదు.

హజ్రత్ అనస్ (రజి) ఒక కథనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద అజ్బా పేరు గల ఒక ఒంటె ఉండేది. అదెంతో వేగంగా పరిగెత్తేది. ఏ ఒంటె కూడా దాని కంటే ముందుకు వెళ్ళలేకపోయేది. ఒక సారి ఒక గ్రామీణుడు తన యువ ఒంటెపై స్వారీ చేస్తూ వచ్చాడు. పందెంలో ఆ ఒంటె అజ్బా కంటే ముందుకు దూసుకు పోయింది. అజ్బా వెనుకబడి పోవడం ఆ వ్యక్తి ముందుకు వెళ్ళిపోవడం ముస్లింలకు తీవ్ర అసంతృప్తిని కలిగించింది. ముస్లింల ఈ ప్రవర్తనను చూసి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు హితబోధ చేశారు. ఈ ప్రపంచంలో అల్లాహ్ ఏ వస్తువునైతే పైకి లేపుతాడో దానిని క్రిందికి దించడం కూడా అల్లాహ్ హక్కు (నియమం).

వినయ, వినమ్రతల మరొక సంఘటనను హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు ఇలా వివరిస్తున్నారు: నేను ఉమ్రా కొరకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను అనుమతి కోరాను. వారు నాకు అనుమతిస్తూ ఇలా అన్నారు: నా ప్రియ సోదరా! నీ ప్రార్థనలలో (దుఆలలో) నన్ను కూడా మరువకు. హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు ఇట్లన్నారు. ప్రవక్త వారు పలికిన ఆ మాట నాకు ఎంతటి ఆనందాన్ని ఇచ్చిందంటే, దానికి బదులుగా నాకు ఈ ప్రపంచమంతా లభించినా కూడా నేను అంతగా సంతోషించేవాడిని కాదు.

వాస్తవానికి, ప్రార్థనలు అల్లాహ్ వద్ద స్వీకరించబడటానికి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై దురూద్ పంపడాన్ని అల్లాహ్ విధిగా చేశాడు. అయినప్పటికీ ప్రవక్త గారి వినయం ఏ స్థాయికి చేరిందంటే, వారు స్వయంగా తన అనుచరుడిని ఉద్దేశించి "నా కొరకు ప్రార్థించు" అని కోరుతున్నారు.

హుజూరె అన్వర్ ఇలా వివరించారు: పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు ఏ పనిని చేయడానికైనా ఎప్పుడూ సిగ్గుపడలేదు లేదా చిన్నచూపు చూడలేదు. అతి చిన్న పనిని కూడా వారు స్వయంగా చేసి చూపిస్తూ ఇతరులకు నేర్పించేవారు. దీనికి సంబంధించిన ఒక ఉదాహరణ ఇట్లుంది: ఒకసారి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒక బాలుడి సమీపం నుండి వెళ్తున్నారు. ఆ బాలుడు ఒక మేక చర్మాన్ని వలుస్తున్నాడు. ప్రవక్త వారు

అతడిని పక్కకు జరిపి ఇలా అన్నారు: కాస్త వెనక్కి జరుగు నేను నీకు సరైన పద్ధతిని చూపిస్తాను. ఎందుకంటే చర్మం వలవడంలో నీకు పూర్తి నైపుణ్యం ఉన్నట్లు నాకు అనిపించడం లేదు. ఆ తర్వాత ప్రవక్త వారు తన చేతిని ఆ మేక చర్మానికి, మాంసానికి మధ్యలోకి చొప్పించి, చంక భాగం వరకు లోపలికి తీసుకువెళ్లారు. ఆపై బాలుడితో ఇలా అన్నారు: ఓ అబ్బాయ్! ఈ విధంగా చెయ్యి చర్మాన్ని ఇలా వలవాలి. ఈ విధంగా ప్రవక్త వారు ఆ బాలుడి పనిని స్వయంగా పూర్తి చేయడమే కాకుండా, దాన్ని ఎలా చేయాలో సరైన పద్ధతిలో నేర్పించారు కూడా.

హజ్రత్ ఖబ్బాబ్ రజియల్లాహు అన్హు కుమార్తె నుండి ఒక కథనం ఇట్లుంది: ఆమె మేక పాలు పిండడం కోసం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు ఒక మేకను తీసుకువచ్చింది. అప్పుడు ప్రవక్త వారు దాన్ని కట్టి, స్వయంగా దాని పాలు పిండారు. ఆపై ఆమెతో నా దగ్గరకు ఒక పెద్ద పాత్రను తీసుకురా అని అన్నారు. ఆమె ఒక పెద్ద పాత్రను తీసుకురాగా ప్రవక్త వారు అందులో పాలు పిండారు, అది నిండిపోయేంత వరకు పాలు వచ్చాయి. ఆ తర్వాత ప్రవక్త వారు ఇలా సెలవిచ్చారు: నువ్వు కూడా ఈ పాలు త్రాగు మరియు నీ పొరుగువారికి కూడా త్రాగించు.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ రజియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు: ఏవరైనా ఒక వ్యక్తి పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ముందుకు వచ్చినప్పుడు, దైవ ప్రవక్త (స) అతనితో కరచాలనం చేసేవారు. అవతలి వ్యక్తి స్వయంగా తన చేతిని వెనక్కి తీసుకునేంత వరకు మహా ప్రవక్త (స) తన చేతిని వెనక్కి లాక్కునేవారు కాదు. అలాగే అవతలి వ్యక్తి తన ముఖాన్ని తిప్పుకునేంత వరకు దైవ ప్రవక్త (స) కూడా తన పవిత్ర ముఖాన్ని అతని వైపు నుండి తిప్పుకునేవారు కాదు. ఇంకా దైవ ప్రవక్త (స) తన సభలో కూర్చున్న వారి కంటే ముందుకు మోకాళ్ళు చాపి కూర్చోవడం ఎన్నడూ చూడబడలేదు. గ్రామీణ మిత్రుడితో ఉన్న స్నేహం గ్రామీణ ప్రాంతాలలో నివసించే 'జాహిర్' అనే ఒక అనుచరుడు ఉండేవారు. ఆయన మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు గ్రామీణ ప్రాంతపు బహుమతులను తీసుకు వచ్చేవారు. అలాగే ఆయన తిరిగి వెళ్ళేటప్పుడు దైవ ప్రవక్త (స) కూడా ఆయనకు అవసరమైన ఎన్నో వస్తువులను, సామగ్రిని ఇచ్చి పంపించేవారు. పవిత్ర దైవ ప్రవక్త (స) తరచూ ఇలా అనేవారు: జాహిర్ మన గ్రామీణ మిత్రుడు, మనం అతని నగర మిత్రులం.

ఒకరోజు హజ్రత్ జాహిర్ రజియల్లాహు అన్హు మార్కెట్లో తన వస్తువులను అమ్ముకుంటున్నారు. అప్పుడు పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అక్కడికి విచ్చేసి, వెనుక నుండి వచ్చి ఆయనను తన కౌగిలిలోకి హత్తుకున్నారు. హజ్రత్ జాహిర్ గారు వెనుక ఉన్నది ఎవరో చూడలేకపోయారు. ఆయన, ఎవరది? నన్ను వదలండి అని అన్నారు. కానీ వెనక్కి తిరిగి చూడగానే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను గుర్తించారు. వెంటనే ఆయన తన వీపును మహా ప్రవక్త (స) పవిత్ర వక్షస్థలానికి మరింతగా ఆనించడం ప్రారంభించారు. అప్పుడు మహా ప్రవక్త (స) సరదాగా ఇలా అనడం ప్రారంభించారు: ఈ దాసున్ని ఎవరు కొంటారు? దానికి హజ్రత్ జాహిర్ ఇలా విన్నవించుకున్నారు: ఓ దైవ ప్రవక్తా! అయితే మీరు నన్ను నష్టపోయే విక్రయంగా చూస్తారు. నన్ను ఎవరు కొంటారు? అప్పుడు పవిత్ర ప్రవక్త సల్లల్లాహుఅలైహి వసల్లం ఇట్లన్నారు: కానీ అల్లాహ్ తఆలా దృష్టిలో నువ్వు నష్టపోయే విక్రయం కావు, అల్లాహ్ సన్నిధిలో నువ్వు చాలా విలువైనవాడివి.

హజ్రత్ ఇమామ్ హుసేన్ రజియల్లాహు అన్హు ఇలా ఎల్లేఖించారు: నేను నా తండ్రి (హజ్రత్ అలీ రజియల్లాహు అన్హు) ను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ గృహంలో ప్రవేశించినప్పుడు గడిపే సమయం గురించి అడిగాను. అందుకు హజ్రత్ అలీ రజియల్లాహు అన్హు ఇలా సమాధానమిచ్చారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ ఇంటికి విచ్చేసినప్పుడు ఇంటి సమయాన్ని మూడు భాగాలుగా విభజించేవారు: ఒక భాగం: వైభవోపేతుడైన అల్లాహ్ ప్రార్థన కొరకు కేటాయించేవారు. మరొక భాగం: తమ కుటుంబ సభ్యుల (హక్కుల) కొరకు కేటాయించేవారు. మూడవ భాగం: తమ సొంత (వ్యక్తిగత) అవసరాల కొరకు ఉంచుకునేవారు. ఆ తర్వాత,

వారు తమ కొరకు కేటాయించుకున్న మూడవ భాగాన్ని కూడా తమకు మరియు ప్రజలకు మధ్య పంచుకునేవారు. ఆ సమయంలో వారు ముఖ్యులైన అనుచరుల ద్వారా సామాన్య ప్రజల వరకు ధర్మ విషయాలను చేరవేసేవారు, వారి నుండి ఎటువంటి విషయాన్ని దాచేవారు కాదు.

హుజూరె అన్వర్ ఇలా వివరించారు: పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరించిన మొట్టమొదటి దివ్యవాణి ద్వారా కూడా వారి వినయ విధేయతలు స్పష్టమవుతాయి. హజ్రత్ ముస్లిహ్ మవూద్ రజియల్లాహు అన్హు ఇలా ఉపదేశిస్తున్నారు: అన్నిటికంటే మొదటి దివ్యవాణి 'హిరా' గుహలో అవతరించింది. అందులో జిబ్రయీల్ అలైహిస్సలాం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు కనిపించి ఇఖ్రా అంటే చదువు అని అన్నారు. అందుకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నాకు చదవడం రాదని సమాధానమిచ్చారు. దీని అర్థం ఏమిటంటే ఈ (ప్రవక్తృత్వపు) భారాన్ని నాపై మోపకండి అని అర్థం. ఎందుకంటే ఆ సమయంలో ప్రవక్త (స) ముందు చదవడానికి ఎటువంటి పుస్తకమూ పెట్ట బడలేదు. కేవలం జిబ్రయీల్ అలైహిస్సలాం ఏది చెబితే దాన్ని ప్రవక్త (స) నోటితో పలకవలసి ఉంది. ఆ విధంగా పలకడం ప్రవక్త (స) నకు సాధ్యమే అయినప్పటికీ వారు తమ వినయాన్ని వ్యక్తపరిచారు. అయితే, అల్లాహ్ తఆలా ఈ గొప్ప కార్యం కొరకు ప్రవక్త వారినే ఎన్నుకున్నాడు కాబట్టి, పదే పదే చదువు అని చెప్పడం జరిగింది. చివరికి మూడవసారి చెప్పినప్పుడు ప్రవక్త వారు చదివారు.

హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు ఇట్లు ఉల్లేఖించారు. నేను ఒకసారి పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో హాజరయ్యాను. వారు తమ మేడ గదిలో ఉండిరి. ఆ సమయంలో వారు ఒక చాపపై పడుకొని ఉ న్నారు. మహా ప్రవక్త (స) నకు మరియు ఆ చాపకు మధ్య మరే ఇతర పరుపు లేదు. వారి తల కింద ఖర్జూరపు నార నింపబడిన ఒక తోలు తలగడ (మెత్త) ఉంది, అలాగే వారి పాదాల వద్ద తుమ్మ చెట్టు ఆకుల కుప్ప పడి ఉంది. నేను వారి పక్కటెముకలపై ఆ చాప గీతలు పడటం చూశాను. ఈ దృశ్యాన్ని చూసి నేను రోదించడం ప్రారంభించాను. అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నన్ను ఇట్లడిగారు: నిన్ను ఏ విషయం ఏడిపిస్తోంది? దానికి నేను ఇలా విన్నవించుకున్నాను: 'ఓ దైవ ప్రవక్తా! పర్షియా, రోమ్ చక్రవర్తులు ఎంతో విలాసవంతమైన ఐశ్వర్యాలలో జీవిస్తున్నారు. మరి మీరేమో అల్లాహ్ నిజమైన ప్రవక్త అయినను ఈ స్థితిలో ఉన్నారా!

అప్పుడు పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించారు: వారికి ఈ ప్రపంచం, మనకు పరలోకం లభించడం నీకు ఇష్టం లేదా? పవిత్ర ప్రవక్త (స) దురుసుగా ప్రవర్తించే వారితో కూడా ఎల్లప్పుడూ మృదువుగా, వినయంగా నడుచుకునేవారు. హజ్రత్ అబూ హురైరా రజియల్లాహు అన్హు నుండి ఒక కథనం ఇట్లుంది: ఒక వ్యక్తి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి, తన అప్పును (హక్కును) తీర్చమని చాలా కఠినమైన స్వరంతో అడిగాడు. అది చూసి అనుచరులు ఆగ్రహానికి లోనయ్యారు. కానీ దైవ ప్రవక్త (స) వారితో ఇలా అన్నారు: అతడిని వదిలేయండి, ఒక ఒంటెను కొని అతనికి ఇచ్చేయండి. అందుకు అనుచరులు అతని అప్పుకు సమానమైన ఒంటె మాకు దొరకడం లేదు, అంతకంటే ఎక్కువ విలువైన ఒంటెలు మాత్రమే ఉన్నాయని విన్నవించారు. అప్పుడు మహా ప్రవక్త (స) ఇట్లన్నారు. ఆ విలువైన ఒంటెనే అతనికి ఇచ్చేయండి. ఎందుకంటే మీలో అప్పును అత్యంత ఉత్తమమైన రీతిలో చెల్లించేవాడే అందరికంటే ఉత్తముడు. మక్కా విజయోత్సవ సంఘటన మక్కా విజయం సమయంలో హజ్రత్ అబూబకర్ రజియల్లాహు అన్హు తన వృద్ధ తండ్రిని తీసుకుని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సేవలో హాజరయ్యారు. పవిత్ర ప్రవక్త (స) ఆయన్ను చూడగానే ఇలా అన్నారు: "ఓ అబూబకర్! వయోవృద్ధుడైన ఈయనను ఇంట్లోనే ఉండనివ్వాల్సింది. నేనే స్వయంగా ఆయన వద్దకు వచ్చేవాడిని కదా! దానికి హజ్రత్ అబూబకర్ రజియల్లాహు అన్హు ఇలా విన్నవించుకున్నారు: ఓ దైవ ప్రవక్తా! మీ సేవలో హాజరవడానికే ఈయన ఎక్కువ అర్హుడు. ఆ తర్వాత హజ్రత్ అబూబకర్ తన తండ్రిని దైవ ప్రవక్త (స) ముందు కూర్చోబెట్టారు. ప్రవక్త (స) ఆయన యదపై చేతిని నిమురుతూ "ఇస్లాం స్వీకరించండి, మీరు శాంతిని పొందుతారని

అన్నారు. ఆ విధంగా అబూ ఖుహాఫా (రజి) ఇస్లాంను స్వీకరించారు.

మహా ప్రవక్త (స) గృహ వాతావరణం గురించి హజ్రత్ హసన్ (రజి) ద్వారా ఒక కథనముంది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తలుపులు అందరి కొరకు ఎప్పుడూ తెరిచే ఉండేవి. దైవ ప్రవక్త (స) కొరకు ఎటువంటి ద్వారపాలకుడు నిలబడేవాడు కాదు. అలాగే వారి కొరకు ఉదయం, సాయంత్రం పెద్ద పెద్ద పాత్రలలో విందులు వడ్డించబడేవి కావు. అంటే అత్యున్నత రకాల ప్రత్యేక వంటకాలేమీ వండబడేవి కావు. పవిత్ర ప్రవక్త (స) ను కలవాలనుకునే ఎవరైనా సరే చాలా సులభంగా వారిని కలుసు కోవచ్చు. వారు నేలపై కూర్చునేవారు. సాధారణ, మందమైన దుస్తులను ధరించేవారు. గాడిదపై స్వారీ చేసేవారు, తన స్వారీ వెనుక ఇతరులను కూడా కూర్చోబెట్టుకునేవారు. భోజనం చేసిన తర్వాత వారు తన పవిత్ర వేళ్లను నాకేవారు (అంటే శుభ్రం చేసుకునేవారు).

వేళ్లను నాకడం గురించి హజ్రత్ జైనుల్ ఆబిదీన్ వలియుల్లా షా రజియల్లాహు అన్హు గారి ఒక సూచన ఉంది. అందులో ఆయన హజ్రత్ డాక్టర్ మీర్ ముహమ్మద్ ఇస్మాయిల్ రజియల్లాహు అన్హు ఆధారంగా ఇలా రాశారు: మానవ చేతి వేళ్లలో ఒక ప్రత్యేక స్పర్శ శక్తి ఉంటుందని వైద్య నిపుణులందరూ ఏకీభవిస్తున్నారు. కనుక భుజించిన తర్వాత తమ వేళ్లను నాకడంతో జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తుంది. మసీదును శుభ్రం చేయడం గురించి హజ్రత్ యాఖూబ్ బిన్ జైద్ రజియల్లాహు అన్హు ఒక  సహాయంతో స్వయంగా శుభ్రం చేసేవారు. అనగా ఆ కర్ర చివర ఏదైనా వస్త్రాన్ని చుట్టి, దానితో మసీదులో ని దుమ్మును దులిపి శుభ్రం చేసేవారని అర్థం.

హజ్రత్ మసీహ్ మవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అల్లాహ్ తఆలా ఎంతో దయామయుడు, కరుణామయుడు. అతను మనుషులను అన్ని విధాలుగా పోషిస్తాడు, వారిపై కరుణ చూపుతాడు. ఆ కారుణ్యం వల్లే అతను తన ద్వారా నియుక్తులైన వారిని, ప్రవక్తలను పంపుతాడు. తద్వారా వారు ఈ ప్రపంచ ప్రజలను పాపభరితమైన జీవితం నుండి విముక్తి ప్రసాదిస్తారు. అయితే, అహంకారం అనేది చాలా ప్రమాదకరమైన వ్యాధి. ఏ మనిషిలోనైతే ఇది జనిస్తుందో, అతనికి ఆధ్యాత్మిక మరణం సంభవిస్తుంది. ఈ అహంకారమనే వ్యాధి హత్య కంటే ఎక్కువ భయంకరమైనదని నేను ఖచ్చితంగా నమ్ముతున్నాను. అహంకారి అయినవాడు సైతాన్ సోదరుడవుతాడు. ఎందుకంటే, అహంకారం వల్లే సైతాన్ అవమానానికి, హీనస్థితికి గురయ్యాడు. కనుక ఒక విశ్వాసికి ఉండవలసిన ముఖ్యమైన లక్షణం అహంకారం అస్సలు ఉండకూడదు. బదులుగా అతనిలో వినయం, విధేయత నిండి ఉండాలి. ఇది దైవనియుక్తుల ప్రత్యేక గుణం. వారిలో అపారమైన వినయ విధేయతలుంటాయి. వీరందరికంటే మిన్నగా, మన పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంలో ఈ గుణం అత్యున్నత స్థాయిలో ఉండేది.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఒక సేవకున్ని నీతో వారు (స) ప్రవర్తన ఎలా ఉండేది? అని అడగడంతో అందుకు ఆయన ఇలా బదులిచ్చారు: నిజం చెప్పాలంటే, నాకంటే ఎక్కువ వారే నాంకు సేవ చేసేవారు. اللهم صل على محمد و على آل محمد و بارك وسلم అల్లాహ్ తాలా మనందరికీ పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలను, వారి ఆచరణలను అనుసరిస్తూ వినయ విధేయతలను అవలంబించే భాగ్యాన్ని ప్రసాదించుగాక!

ముగింపులో చివరగా హుజూరె అన్వర్ అయ్యదహల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ కీ॥ శే॥  గౌ॥ మలిక్ దావూద్ మహ్మూద్ గారి (ముహమ్మద్ ఇస్హాక్ గారి కుమారుడు) సేవలను స్మరిస్తూ, వారి కొరకు పరోక్ష అంత్యక్రియల ప్రార్థన చదివిస్తానని ప్రకటించారు.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ ـ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا ـ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ ـ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ـ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ ـ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ ـ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ ـ